క్లుప్తంగా

బ్రాహ్మణ సమాఖ్య జిల్లాఉపాధ్యక్షుడిగా నాగరాజు



నగరి: ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా, నియోజకవర్గ అధ్యక్షుడిగా నగరి పట్టణానికి చెందిన తుళా నాగరాజు శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అరిపిరాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సంజీవ నవీన్‌కుమార్ శర్మ నుంచి శుక్రవారం నియామక పత్రాలు అందాయి. ఈ సందర్భంగా నాగరాజుశర్మ మాట్లాడుతూ.. బ్రాహ్మణ సమాఖ్య నియమనిబంధనలకు అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు.

పోషకాహారంతోనే పిల్లల ఆరోగ్యం



పోషకాహారం పంపిణీ చేస్తున్న సీడీపీఓ

నింద్ర: పోషకాహారంతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని నగరి సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం కేఆర్‌పాళెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, కిశోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నుంచి బయటపడవచ్చని తెలిపారు. అనంతరం పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నగరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వేలావడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓ శ్రీదేవి ఆధ్వర్యంలో పాఠశాలకు వెళ్లిన వైద్య సిబ్బంది తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని తల్లిదండ్రులకు వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



పీఈటీ గుర్రప్పను సన్మానిస్తున్న టీచర్లు

విజయపురం (నగరి): జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న బి.గుర్రప్పను పన్నూరు పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు జానకిరామరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: మండలంలోని ఆర్‌బీకేల్లో రైతు భరోసాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకులు, వలంటీర్లకు ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ విధిగా చేసుకోవాలన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై పద్మావతి అమ్మవారిని అధిష్టింపజేశారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం ఊంజల్ సేవ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

18 నుంచి తిరుమలలో జడ్జి విధులు

తిరుపతి లీగల్: తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి 26 వరకు తిరుమలలో విధులు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సమయంలో ఆ కోర్టుకు ఇన్‌చార్జ్ న్యాయమూర్తిగా తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్ వ్యవహరిస్తారని వెల్లడించింది.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం గాజంకి సచివాలయ పరిధిలోని రౌతువానిగుంట, విరాటపురం, క్రిష్టాపురం, దిగువ ఎర్రమరాజుపల్లె, ఎగువ ఎర్రమరాజుపల్లె, దళితవాడ, గాజంకి, గాజంకి దళితవాడ, అమ్మోరుగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యలు

రౌతువానిగుంట దళితవాడ, విరాటపురం గ్రామాల్లో విద్యుత్ తీగలు ఇళ్ల మీదుగా వెళ్తున్నాయని గ్రామస్తులు డిప్యూటీ సీఎంకు నివేదించారు. స్పందించిన ఆయన వాటిని తొలగించాలని ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజును ఆదేశించారు. అలాగే ఎర్రరాజుపల్లె, గాజంకి, గాజంకి దళితవాడ గ్రామస్తుల వినతిపై స్పందించారు. ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంటికీ లబ్ధి

ప్రతి ఇంటికీ లక్ష నుంచి 6 లక్షల రూపాయల వరకు లబ్ధి పథకాలతో చేకూరిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. పేదల పాలిట కల్పవృక్షంగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి, రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని కోరారు. ప్రజాధనాన్ని స్వాహా చేసి జైలు పాలైన చంద్రబాబు అధికారం కోసం వెంపర్లాడుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచులు చిన్నబ్బరెడ్డి, హరోహరరెడ్డి, ఎంపీటీసీ రాధికారెడ్డి మాజీ ఎంపీటీసీ మురగయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, క్రిష్టారెడ్డి, ధనంజయవర్మ, మండల కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, చందురాజు, మాజీ సర్పంచ్ చెంచయ్య, రాజారెడ్డి, వరాలురెడ్డి, ఉప సర్పంచ్ దొరస్వామి, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంధుల కుటుంబాన్ని ఆదుకుంటాం



అంధులైన గుంటిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం: అంధుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రైతువానిగుంటలో ఆయన గుంటిరెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ ఇంట్లో ఉన్న నలుగురు గుంటిరెడ్డి, మల్లేశ్వరి, రేఖ, మౌనిక అంధులని, వారు దుర్భర జీవితం అనుభవిస్తున్నారని తెలుసుకున్నారు. వారిలో ముగ్గురికి మాత్రమే పింఛన్ వస్తుందని చెప్పడంతో స్పందించారు. ముఖ్యమంత్రి దృష్టికి వీరి సమస్యను నివేదించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున పింఛన్ అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

చవితి మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కార్వేటినగరం: వినాయక చవితి సందర్భంగా మండలంలో పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు విధిగా పొందాలని ఎస్.ఐ దస్తగిరి తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేసుకునేవారు ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ తీగల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని, లౌడు స్పీకర్లను రాత్రి 7 గంటల నుంచి ఉదయం ఆరుగంటల వరకు ఉపయోగించరాదన్నారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

గంగాధరనెల్లూరు, పెనుమూరు ఎస్ఐలు అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కూడా చవితి వేడుకల నిర్వహణ గురించి ఇదే అంశంపై మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సిబ్బంది

నగరి: మండలంలోని మాంగాడు దళితవాడలో సారా విక్రయిస్తున్న నాథముని(44)ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి శుక్రవారం అరెస్ట్ చేశారు. అతనివద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో ఎస్ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ బాలముని, మోహన్‌రెడ్డి, విజయకుమార్, సతీష్, పీసీలు కార్తికేయన్, గురవయ్య, వల్లి పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్‌కు పరామర్శ



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం వడమాలపేట మండలం ఏఎంపురం సచివాలయ కన్వీనర్ రమేష్‌యాదవ్ తండ్రి సుబ్రమణ్యం యాదవ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడులో వైఎస్సార్ పెన్షన్ కానుక కింద కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ పంపిణీ చేశారు. ఏ పథకమైనా కేవలం అర్హతే ప్రామాణికంగా తమ ప్రభుత్వం వర్తింపజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

గంగాధరనెల్లూరు: మండలంలోని రెడ్డిపల్లెలో నూతన వినాయక ఆలయంలో శుక్రవారం మహాకుంభాభిషేకం కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి వీటిని అందజేశారు. కార్యక్రమంలో గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, నాయకులు ఢిల్లీకుమార్, హరీశ్ యాదవ్, మదన్, దాము పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించవచ్చు



మాట్లాడుతున్న టీటీడీ విద్యాధికారి భాస్కర్‌రెడ్డి

పుత్తూరు రూరల్: కళాశాల జీవితం ఎంతో విలువైందని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే లక్ష్యాలను సాధించవచ్చని టీటీడీ విద్యాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యున్నత విద్యార్హత కలిగిన అధ్యాపకులతో బోధనతో పాటు ఉన్నత స్థాయి సదుపాయాలన్నీ ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావ్ మాట్లాడుతూ.. తెలిసి చేసినా, తెలియక చేసినా ఒక్క తప్పిదనంతో జీవితం తల్లకిందులవుతుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. తాత్కాలిక ఆనందాల కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని, అది మీ కుటుంబం మొత్తానికి శాపంగా పరిణమిస్తుందని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపళ్లు గోపాల్‌రెడ్డి, రఘుపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.


బీరువా, కుర్చీల వితరణ



బీరువా వితరణ చేసిన విద్యార్థులతో అధ్యాపకులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న బీకాం(సీఏ) విద్యార్థులు కళాశాలకు ఫర్నీచర్ వితరణ చేశారు. సుమారు రూ.10 వేల విలువ చేసే బీరువా, కుర్చీలను కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుని బ్రహ్మోత్సవం.. చూసి తరిద్దాం!



కాణిపాకం(యాదమరి): గణనాథుని బ్రహ్మోత్సవాలకు కాణిపాకం ముస్తాబవుతోంది. ఈ నెల 18న వినాయక చవితి నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగనున్నాయి. స్వామివారు సిద్ధి, బుద్ధి సమేతంగా వివిధ వాహనాలలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, వాహన సేవల వివరాలు ఏంటో తెలుసుకుందాం.

ధ్వజారోహణం

వినాయక చవితి మరుసటి రోజు నుంచి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం అవుతాయి. తొలిరోజు ధ్వజా రోహణం, స్వామివారి వాహనమైన మూషికచిత్రపటాన్ని ఆలయ ధ్వజారోహణంపై ఎగురవేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరిగేలా దేవతలు ఆశీర్వదిస్తారని ప్రతీతి.

హంస వాహనం సేవ

మొదటి రోజు రాత్రి హంస వాహనంపై ఊరేగుతూ దేవదేవేరులు భక్తులకు దర్శనం ఇస్తారు. హంస వాహన సేవలో స్వామిని దర్శించుకుంటే మానవుల్లో సద్గుణాలు అలవడుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

మయూర వాహన సేవ

రెండవ రోజు స్వామివారు మయూర(నెమలి) వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇస్తారు. మనిషిలో మంచిని గుర్తించేందుకు నెమలి వాహన సేవను చూసి తరించాలంటూ పురాణాలు చెబుతున్నాయి.

మూషిక వాహన సేవ

మూషికాసురుడిని స్వామి వారు వధించి, అతని కోరిక మేరకు మూషికాన్ని తన వాహనంగా చేసుకొని మూడో రోజు ఊరేగుతారు. ఈ వాహన సేవలో పాల్గొంటే గర్వాన్ని పోగొట్టి మంచి మార్గంలో నడిపిస్తాడని నమ్మకం.

శేష వాహన సేవ

నాగలోకానికి అధిపతి నాగరాజు. అలాంటి శేష వాహనంపై వినాయకుడు నాలుగోరోజు భక్తులకు దర్శనం ఇస్తారు. ఉత్సవాలలో చిన్న, పెద్ద శేషవాహనాలపై ఉదయం, రాత్రి వేళలో పురవీధుల్లో ఊరేగుతారు.

వృషభ వాహన సేవ

వృషభానికి అధిపతి శివుడు. ఐదో రోజు ఉత్సవంలో వినాయకుడు వృషభ వాహనంపై కొలువుదీరి విహరిస్తారు. ఈ సేవలో పాల్గొంటే స్వామి వారి కరుణా కటాక్షాలతోపాటు శివుని అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

గజవాహన సేవ

ఆరో రోజు ఏనుగు తలను తన శిరస్సుగా మార్చుకొని స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి గజవాహనంపై స్వామి వారిని భక్తులు దర్శించుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రథోత్సవం

మూషికాసురుని సంహరణకు వినియోగించే రథంపై ఏడో రోజున స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి రథోత్సవాన్ని తిలకిస్తే సకల దోషాలు పరిహరిస్తాయని భక్తుల విశ్వాసం.

అశ్వవాహన సేవ

మూషికాసురుని సంహారం తర్వాత బ్రహ్మమానస పుత్రికలైన సిద్ధి, బుద్ధిలతో స్వామివారికి కల్యాణోత్సవం చేస్తారు. అనంతరం స్వామి వారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇస్తారు.

ఏకాంత సేవ

బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత ధ్వజావరోహణాన్ని అంగరంగ వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కార్యక్రమం తర్వాత స్వామివారి మూల విగ్రహానికి పాయసం, వడలతో అభిషేకం నిర్వహిస్తారు. దీనిని వడాయిత్తు ఉత్సవంగా అంటారు. అనంతరం స్వామివారికి ఏకాంత సేవను నిర్వహిస్తారు.

పొన్నియమ్మ సేవలో మంత్రి ఆర్కేరోజా



అమ్మవారికి సారె తీసుకొస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్‌పేట పొన్నియమ్మ జాతరలో శుక్రవారం రాత్రి మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. జాతర నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఆమెను ఆహ్వానించారు. పొన్నియమ్మకు సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు గంగాధరం, మురుగ, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కన్నాయిరం, షణ్ముగం, సంబంధం, మణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ సత్తా చాటాలి



కార్వేటినగరం : క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం కోటేశ్వరరావు





పాలసముద్రం: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ప్రసాద్, కబడ్డీ ఆడుతున్న బాలికలు

కార్వేటినగరం: విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆ స్కూలు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్–14, అండర్–17 విభాగంలో బాలబాలికలకు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ తదితర క్రీడలకు పలు పాఠశాలల నుంచి దాదాపు 200 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రి, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, ఎస్ఐ ప్రసాద్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. క్రీడలతో కూడా భవితకు బాటలు వేసుకోవచ్చన్నారు. అనంతరం అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఖో–ఖో, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, కబడ్డీ, హైజంప్, షాట్‌పుట్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్‌నాయుడు, పీఈటీలు శివకుమార్, అన్బరసన్, గోవిందమ్మ, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



త్రోబాల్ ఆడుతున్న బాలికలు

జోరుగా స్కూల్ గేమ్స్



పన్నూరులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడో రోజు ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ జరిగాయి. శుక్రవారం అండర్–14, అండర్–17 బాల బాలికలకు త్రోబాల్, కబడ్డీ, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నందకుమార్, మండల ఆర్గనైజర్ గోపీకృష్ణ, పీడీలు జయదేవ్, షమ్‌షుద్దీన్, మోహన్ బాబు, బాబు, అరుణ, శివకుమార్, లక్ష్మి, కవిత పోటీలను పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విజయపురం (నగరి): మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంఈఓ జానకీరామరెడ్డి అన్నారు. శుక్రవారం పన్నూరు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్) క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గుర్రప్ప, గోపి, సుజాత, లక్ష్మీపతి, మనోజ్, కుమార్, వాణిశ్రీ, శివ పాల్గొన్నారు.